సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 12 । మే । 2024



వైభవంగా కల్యాణోత్సవం

వల్లూరు మండలంలోని పుష్పగిరిలో కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. -8లో



మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. -10లో

గరిష్టం/కనిష్టం
40.0/29.8

వాతావరణం

జిల్లాలో శనివారం 29.8 - 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

కూటమితో కాంగ్రెస్ కుమ్మక్కు

- కడప పుత్తా ఎస్టేట్స్‌లో రాహుల్‌గాంధీ బహిరంగసభ
- వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే కాంగ్రెస్ ఏకైక ఎజెండా
- ముస్లిం మైనార్టీ అభ్యర్థుల ఎంపికకు అదే సంకేతం
- తద్వారా టీడీపీకి సాయం చేయాలనే లక్ష్యం



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీతో కాంగ్రెస్ పార్టీ మిలాఖత్ అయింది. నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీకి అధ్యక్షురాలిగా షర్మిల నియామకం పొందినప్పటినుంచి అందరికీ అనుమానం ఉండేది. దాన్ని రుజువు చేస్తూ కాంగ్రెస్ అడుగులు పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే ఏకైక ఎజెండాగా ఆ పార్టీ వ్యవహరిస్తోంది. సంప్రదాయ ఓట్లకు గండి కొట్టాలనే ఎత్తుగడను అవలంబిస్తోంది. అందులో భాగంగా ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ కూడా సహకరిస్తోంది. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రాహుల్‌గాంధీ బహిరంగసభ టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి ఎస్టేట్స్‌లో నిర్వహించడం అందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

- జిల్లాలో వైఎస్ కుటుంబం అన్నా, వైఎస్సార్‌సీపీ అన్నా పార్టీలకు అతీతంగా ముస్లిం మైనార్టీలు అండగా నిలుస్తున్నారు. అనేక ఎన్నికలు ఆ విషయాన్ని స్పష్టం చేశాయి. ఇప్పటికే కడపలో రెండు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎస్‌బీ అంజద్‌బాషా విజయం సాధించారు. ఈమారు విజయాన్ని అడ్డుకోవాలని టీడీపీ విశ్వప్రయత్నం చేస్తోంది. అందుకు కాంగ్రెస్ సహకారం తీసుకుంది. ఓవైపు టీడీపీ విద్వేషాలు రెచ్చగొడుతూ కుట్ర రాజకీయాలు చేస్తుండగా, మరోవైపు కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. గణనీయమైన మద్దతుగా ఉన్న ముస్లిం మైనార్టీ ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ఎత్తుగడలు వేశారు. వైఎస్సార్‌సీపీ నేత అఫ్జల్‌ఖాన్‌ను రాత్రికి రాత్రే కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ముస్లిం మైనార్టీల్లో పఠాన్ సామాజిక వర్గీయుల మద్దతు దక్కించుకోవాలనే దురుద్దేశం అందులో దాగి ఉన్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ముస్లిం మైనార్టీ ఓటర్లలో చీలికలు తీసుకువస్తే...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించారు. వెనుకబాటు తనంలో ఉన్న ముస్లింల జీవితాల్లో సామాజిక మార్పు వచ్చింది. తద్వారా వైఎస్ కుటుంబానికి ముస్లింలు అండగా ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్న ఆ వర్గం ఓట్లలో చీలికలు తీసుకువచ్చేందుకు టీడీపీ ప్రణాళికలు అమలు చేసింది. తద్వారా టీడీపీ అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చే చర్యలకు పూనుకుంది. కడప, ప్రొద్దుటూరు, రాయచోటి నియోజకవర్గాలలో ఇదే పంథాను కాంగ్రెస్ ఎంచుకుంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి డైరెక్షన్‌లో కాంగ్రెస్‌పార్టీ యాక్షన్ చేస్తోంది. రహస్య ఎజెండా మేరకు ఎవరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వహిస్తూ వైఎస్సార్‌సీపీ సంప్రదాయ ఓట్లకు గండి కొట్టే ఎత్తుగడలు వేస్తున్నారని విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు.

అందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఆర్థిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

టీడీపీ-కాంగ్రెస్ మధ్య పరస్పర సహకారం

కాంగ్రెస్ పార్టీకి తెలుగుదేశం పార్టీ సైతం బాహాటంగా సహకరిస్తోంది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కేసులో అసంబద్ధ వ్యాఖ్యలు చేయవద్దని, విచారణ కోర్టులో ఉన్న నేపథ్యంలో ఇష్టానుసారం మాట్లాడవద్దని జిల్లా కోర్టు భావించింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను వెకేట్ చేయాలంటూ షర్మిల, సునీతలతోపాటు పులివెందుల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీటెక్ రవి కూడా హైకోర్టును ఆశ్రయించారు. తదపరి జిల్లా కోర్టుకు తప్పుడు ఫిర్యాదు చేయడంతో ముగ్గురికి రూ.10వేలు చొప్పున రూ.30వేలు జరిమానా కూడా జిల్లా కోర్టు విధించింది. అది అటుంచితే ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు అనేకం ఉన్నా, కమలాపురం తెలుగుదేశం పార్టీ నేత పుత్తా నరసింహారెడ్డి స్థలంలో రాహుల్‌గాంధీ బహిరంగ సభ నిర్వహించడం గమనార్హం.



ఇడుపులపాయ సందర్శన ఎన్నికల ఎత్తుగడే

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి హోదాలో దివంగతులై దాదాపు 15ఏళ్లు కావస్తోంది. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడంలో వైఎస్సార్ పాత్ర అప్పట్లో అత్యంత కీలకం. అలాంటి వ్యక్తి అర్ధంతరంగా మృతి చెందితే, ఇడుపులపాయ ఘాట్‌కు సోనియాగాంధీ కుటుంబం రాలేదు. 15 సంవత్సరాల తర్వాత రాహుల్‌గాంధీ రావడం విశేషం. ఈ పర్యటన కేవలం ఎన్నికల ప్రచార ఎత్తుగడగా స్పష్టమవుతోంది. వైఎస్సార్ ఘాట్‌లో రాహుల్‌గాంధీ పట్టుమని 10 నిమిషాలున్నారు. వైఎస్సార్ మరణాన్ని తట్టుకోలేక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 600 మంది మృతి చెందారు. వారి మృతికి చిహ్నంగా ఘాట్‌లో స్థూపాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ స్థూపాన్ని కూడా సందర్శించేవారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఓటర్లు 1639066
- పోలింగ్ కేంద్రాలు 2035
- పోలింగ్ సిబ్బంది 14640
- లోక్‌సభ అభ్యర్థులు 14
- ఏడు శాసనసభ నియోజకవర్గాల బరిలో 110 మంది అభ్యర్థులు
- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ అమలులోకి వచ్చిందన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. జిల్లాలో 16,39,066 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కొత్త ఓటర్లు (18-19 వయస్సు) 45,196 మంది ఉన్నారన్నారు. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలతో కలిపి జిల్లాలో 1359 లోకేషన్స్‌లో 2035 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో 527 క్రిటికల్, 14 వల్నరబుల్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1222 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, 741 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామన్నారు. ఓటరు స్లిప్పులు, ఓటరు గైడ్లు 98.96 శాతం పంపిణీ చేశామని పేర్కొన్నారు. పోలింగ్‌లో 4712 సీయూలు, 4712 బీయూలు, 5158 వీవీ ప్యాట్లు వినియోగించనున్నట్లు తెలిపారు. జిల్లాను 214 సెక్టార్లుగా విభజించి అధికారులను నియమించామని వివరించారు. అలాగే 610 మంది మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామన్నారు.



జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

ప్రిసైడింగ్ అధికారులు 2334, ఏపీఓలు 2336, ఓపీఓలు 9360 మందిని నియమించామన్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. పోలింగ్‌రోజున పబ్లిక్, ప్రైవేటు, అండర్ టేకింగ్ సంస్థలకు సెలవు రోజుగా ప్రకటించామన్నారు. కడపలోని మను పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూము ఉంటుందన్నారు. ఎన్నికల పరిశీలకులు అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంలను స్ట్రాంగ్ రూములో ఉంచుతామని చెప్పారు. ఓటర్లు కాని వారు నియోజకవర్గం నుంచి వెళ్లిపోవాలని కోరారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఓటింగ్ కోసం ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే స్థానిక ఓటర్లు చెక్ పోస్టుల వద్ద ఓటరు గుర్తింపు కార్డును చూపించి రావొచ్చని ఎన్నికల అధికారి విజయరామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనిఖీల వద్ద ఏదైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ : 08562- 315672 కు కాల్ చేసి తెలియచేయాలన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- ఎన్నికలలో అల్లర్లకు పాల్పడితే తాటతీస్తా: ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ హెచ్చరిక

-వివరాలు 10లో

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



ఇంటర్న్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, అధ్యాపకులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపుల పాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్వీ అసోసియేట్స్ గ్లోబల్ సివిల్ ఇంజినీరింగ్ సంస్థ ఇంటర్న్ షిప్‌కు ఒప్పందం కుదుర్చుకున్నట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఆ సంస్థ తిరుపతిలోని ఐటీలో నిర్వహించిన సమావేశానికి ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ప్రొ.కె.చెంచురెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొ.విజయకుమార్ హాజరయ్యారు. తొలి విడతలో భాగంగా ట్రిపుల్‌ఐటీ సివిల్ ఇంజనీరింగ్‌కు చెందిన 12 మంది విద్యార్థులకు నెలకు రూ.10 వేల చొప్పున వేతనం లభిస్తుందన్నారు. విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐటీ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పులివెందుల విద్యార్థికి గేట్‌లో ఉత్తమ ర్యాంకు



జయరమేష్

పులివెందుల : పులివెందుల పట్టణానికి చెందిన దాసరి ఈశ్వరయ్య, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు జయరమేష్ ఇటీవల నిర్వహించిన గేట్ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయి 59వ ర్యాంకు సాధించాడు. దీంతో బెంగుళూరులో జయరమేష్‌కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి ఎంటెక్ బయో ఇంజినీరింగ్ సీటు సాధించారు. జయరమేష్ ఇటీవలే బీటెక్ ఎన్‌ఐటీ వరంగల్‌లో నాల్గవ సంవత్సరం పూర్తి చేశాడు. ర్యాంకు రావడం పట్ల ఆయన తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ సర్పంచ్‌కు గాయాలు

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ నాయకుడు ,బి.కొత్తకోట మాజీ సర్పంచు ఇసరయ్యగారి నాగరాజు శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ జాఫర్‌బాషాతో కలిసి బైక్‌పై శంకరాపురం నుంచి బి.కొత్తకోటకు వస్తుండగా మార్గ మధ్యంలో బైక్ అదుపుతప్పి కింద పడింది. దీనితో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కాలి ఎముక విరిగిందని గుర్తించిన వైద్యులు శనివారం శస్త్ర చికిత్స చేశారు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- వేంపల్లె నాలుగు రోడ్ల కూడలి నుంచి ప్రధాన కూడళ్లలో రోడ్ షో





రోడ్‌షోలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు (ఇన్‌సెట్) రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

వేంపల్లె : ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో విశ్వసనీయతకు పట్టం కట్టాలని, చంద్రబాబు మాయ మాటలు నమ్మవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. వేంపల్లి–పులివెందుల రోడ్డు నుంచి ప్రధాన కూడళ్లలో శనివారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలుకుతూ గజమాలలతో ఎంపీ అవినాష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారన్నారు. అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిన నమ్మక ద్రోహి చంద్రబాబు అన్నారు. వేంపల్లె మండలంలో రూ.625కోట్ల అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ సోదరులకు ఉర్దూ జూనియర్ కళాశాల, రూ.20 కోట్లతో వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రైతు బజార్, వైఎస్సార్ మెమోరియల్ పార్కు, వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం, ఫైర్ స్టేషన్, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో పులివెందుల నియోజకవర్గం నెంబర్ వన్‌గా నిలవాలని కోరారు. అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోతిరెడ్డిపాడు రెగ్యులేటరీ 11 టీఎంసీల నుంచి 44 టీఎంసీల వరకు పెంచకుంటే చుక్క నీరు వచ్చేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక రూ.240 కోట్లు ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీ చెల్లించి సీబీఆర్‌లో 2020 నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది 10 టీఎంసీలు నీరు నిల్వ చేస్తున్నామన్నారు. వేంపల్లి చివరి ఆయకట్టు వరకు సీబీఆర్ హైడిపాలెం పిబిసి ద్వారా నీళ్లు అందిస్తున్నామన్నారు. మండలంలోని పాములూరు, అమ్మగారిపల్లె రైతు సోదరులు పీబీసీ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాలువ ద్వారా నీరు అందించామన్నారు. తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన, బీజేపీలను కూటమిగా కలుపుకొని ప్రజలందరినీ మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఎల్లో మీడియా ఇచ్చిన స్క్రిప్టును ఈ కాంగ్రెస్ నాయకులు చదువుతూ జగన్‌మోహన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిలను ఇష్టం వచ్చినట్టుగా ద్వేషిస్తున్నారు. అక్కచెల్లెమ్మల్లోనూ ద్వేషాన్ని నింపాలని చూస్తున్నారన్నారు. పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు, షబ్బీర్‌వల్లి, డా.ఎస్.ఎఫ్ బాషా, మునీర్, సల్మా, కొండయ్య, రవిశంకర్ గౌడ్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

రాయచోటి : రాయచోటిని అన్ని రంగాలలో అభివృద్ధి చేశా.. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేశాను.. ఈ ఎన్నికలలో నాకు ఓటు వేసి ఆశీర్వదించండి, మరింత అభివృద్ధి చేస్తా అని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు.రాయచోటి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియాతో శనివారం మాట్లాడుతూ రాయచోటిని జిల్లా కేంద్రంగా చేశామన్నారు. కరోనా విపత్కర పరిస్థితులలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తాము పడిన శ్రమను ప్రజలు కళ్లారా చూశారన్నారు. ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు, ఆక్సిజన్ సిలిండర్లు సిద్ధ చేయడం, సొంత డబ్బుతో ఆయుర్వేద మందులు అందివ్వడం చేశామన్నారు. రాయచోటిని స్పెషల్ గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా చేశామని వివరించారు. రాజంపేట, మదనపల్లిలో పోటీ చేసే అభ్యర్థులు వాటిని జిల్లా కేంద్రంగా మారుస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు.

పేదల ఉసురు టీడీపీకి తగులుతుంది

రాష్ట్రంలో పేదలు, విద్యార్థులు, మహిళలకు చేయూత, ఆసరా, ఇతరులకు సబ్సిడీ అందనీయకుండా చేసిన టీడీపీకి వారి ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో పేద ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండా, లంచాలకు తావు లేకుండా నేరుగా వారి ఖాతాలకు డబ్బు జమ చేశామన్నారు. ఈ ఏడాది ప్రజలకు అందాల్సిన డబ్బులు విడుదల కాకుండా కోర్టులో పిటిషన్ వేసి టీడీపీ వారు అడ్డుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాష, జిల్లా మైనార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

పసికందు గొంతు నులిమేశాడు

- మద్యం మత్తులో దారుణం
- కన్న కొడుకుని కడతేర్చిన కసాయి తండ్రి
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



మృతి చెందిన బాలుడు

వేంపల్లె : చేయి పట్టుకుని నడిపించిన తండ్రి... కంటికి రెప్పలా చూసుకోవాల్సిన ఆయనే మద్యం మత్తులో అభం శుభం తెలియని ఏడాదిన్నర కొడుకు గొంతు నులిమి కడతేర్చాడు. ఈ విషాద ఘటన వైఎస్సార్ జిల్లా వేంపల్లెలోని రాజీవ్ కాలనీలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లాలోని రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన సంధ్యకు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సురేష్‌తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు శ్రీనివాసులు(2) సంతానం. వారిరువురూ వేంపల్లె రాజీవ్ కాలనీలో నివాసముంటూ ఇద్దరూ కూలి పని చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మద్యం మత్తులో సురేష్ విచక్షణ కోల్పోయి కొడుకు శ్రీనివాసులు(2) గొంతు నులిమాడు. సురేష్ తల్లి కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సంధ్య పుట్టుకతోనే మూగి కావడంతో సురేష్ ఆమెపై నింద వేయాలని చూశాడు. పోలీసులు మందలించడంతో తాగుడుకు తాగిన మత్తులోనే కొడుకును చంపినట్లు పోలీసులకు తెలిపారు. దీంతో సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కుమారుడి మృతితో తల్లి విలపించడం స్థానికులను కలచివేసింది. సురేష్ తల్లి ఫిర్యాదు మేరకు వేంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు

వైభవంగా చెన్నకేశవుడి కల్యాణోత్సవం



వైద్యనాథుని కళ్యాణ మహోత్సవంలో తాళిని చూపుతున్న పురోహితులు



శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవంలో తాళిని చూపుతున్న పండితులు



కల్యాణానికి హాజరైన భక్తులు

వల్లూరు : పుష్పగిరిలో కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ చెన్నకేశవ స్వాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉదయం వైద్యనాథేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ వేదికపై కామాక్షీ వైద్యనాథుల కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణతో, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో మునిగి పోయారు. అనంతరం నంద్యాల హరి క్రిష్ణ, చింతలపత్తూరు అవధానం చెంచు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శనివారం రాత్రి కొండపై చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుని కళ్యాణం వైభవోపేతంగా జరిగింది. అలంకార భూషితులైన శ్రీదేవి ,భూదేవిలు చెన్నకేశవ స్వామిలను వేదికపై ఆశీనులయ్యారు. మంగళ వాయిద్యాల నడుమ వేద మంత్రాల సాక్షిగా యజ్ఞోపవీత ధారణ, కంకణ ధారణ, కన్యాదానం, అనంతరం మంగళసూత్రధారణ నిర్వహించారు. కనులారా వీక్షించిన భక్తులు భక్తిభావంతో పులకించి పోయారు. స్వామి వారి ముత్యాల తలంబ్రాలను పండితులు భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతమంతా లక్ష్మీ చెన్నకేశవ నామ స్మరణతో మార్మోగింది. అనంతరం ముదిరెడ్డి వెంకట నరేష్ కుమార్ రెడ్డి, కేతు వెంకటేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామికి, శ్రీ చెన్నకేశవ స్వామికి గజవాహన సేవను నిర్వహించారు.

గరుడ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

శుక్రవారం తెల్లవారుజామున చెన్నకేశవ స్వామి తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 2 గంటల సమయంలో స్వామిని కొండపై నుండి పల్లకిలో మోస్తూ బాణా సంచా పేలుస్తూ, గ్రామ మాడ వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. పల్లకిని మోయడానికి భక్తులు పోటీలు పడ్డారు. స్వామివారి గరుడ వాహన సేవను చూడటానికి రాత్రంతా పుష్పగిరిలోనే వున్న వేలాది మంది భక్తులు దర్శించుకుని తరించారు.

నేడు రథోత్సవాలు : బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, మధ్యాహ్నం 4. 30 గంటలకులక్ష్మీ చెన్నకేశవుల రథోత్సవం జరుగుతుంది.

14 నుంచి అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న కొత్తమిద్దె రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజూ అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు, అలంకరణ, వాహనోత్సవం, సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 22న సాయంత్రం ఆరు గంటలకు గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, గురువారం సాయంత్రం గ్రామోత్సవం, 23న రథోత్సవం, 24న వసంతోత్సవం మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వినియోగం, 25న పవళింపు సేవ, 26న శాంత్యుత్సవం ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునశెట్టి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటేష్, నాగేశ్వరి, భారతి, సావిత్రమ్మ, మహేష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ : గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. స్థానిక సంత గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి (44), రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. కింద పడిన గుర్తుతెలియని వ్యక్తి తలపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అతను అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. క్షణాల్లో జరిగిన సంఘటన నుంచి స్థానికులు తేరుకునే లోపే ఆర్టీసీ బస్సు అక్కడి నుంచి వెళ్లిపోయింది. వెంటనే స్థానికులు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన మిడుతూరు వాసులతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



పార్టీలో చేరిన జమ్మలమడుగు కుండా వీధి వాసులు



వనిపెంట వడ్డెర సంఘం నాయకులతో రఘురామిరెడ్డి



ఖాజీపేట మండల వాసులతో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : ఖాజీపేట మండలం మిడుతూరు ఎస్సీ కాలనీకి చెందిన 50 కుటుంబాల వారంతా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఆర్టీసీ మాజీ జోనల్ ఛైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో దేవగుడి హరి, గుండుగాళ్ల ప్రసాద్, దేవగుడి చిన్న ఓబయ్య, దేవగుడి బయన్న, గుండుగాళ్ల బాలుడు, దొడ్డవాండ్ల అంకుశం, కొండేపోగు రఘు, దొడ్డవాండ్ల రాజు, మాచిరెడ్డిపల్లె వెంకటరమణ, కొండేపోగు ఓబులేసు, బుడ్డోళ్ల కిరణ్, కె.మహేష్, ఎం.రమేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తొట్టి సుబ్బారెడ్డి(బళ్లారి), చిన సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, ఎలిచర్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ టి.చంద్ర, జి.లక్ష్మయ్య, టి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నాయకులు

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంటకు చెందిన వడ్డెర సంఘం నాయకులు మల్లెపోయిన వీరయ్య, ముద్దం సుబ్బ రాయుడు, ముద్దం లిఖిత్ శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వనిపెంట ఎంపీటీసీ ఇర్షాద్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇడగొట్టు శేషు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వారికి కండువాలను వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోసెలాజం, వెంకయ్య, తేజ, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

మైదుకూరు : ఖాజీపేట మండలం సన్నపల్లెకు చెందిన తుమ్మలూరు భాస్కర్‌రెడ్డి (టీసీఎల్), తుమ్మలూరు రవీంద్రారెడ్డి, దువ్వూరి గురివిరెడ్డి, దువ్వూరి మహేశ్వరరెడ్డి, గోపవరం గురివిరెడ్డి, మండెం వెంకటసుబ్బయ్య యాదవ్, దువ్వూరి బాలిరెడ్డి, తుమ్మలూరు శివశంకర్‌రెడ్డి, తుమ్మలూరు రామకృష్ణారెడ్డి, తుమ్మలూరు వీరారెడ్డి తదితర 20 కుటుంబాల వారంతా శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆర్టీసీ మాజీ జోనల్ ఛైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పోలురెడ్డి చిన్న వీరారెడ్డి, తుమ్మలూరు ప్రభాకర్‌రెడ్డి, కనపర్తి సుబ్బారెడ్డి, తుమ్మలూరు రవీంద్రారెడ్డి, సోముల సుబ్బారెడ్డి, వీర భాస్కర్‌రెడ్డి, కనపర్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగులో 30 కుటుంబాలు

జమ్మలమడుగు : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పార్టీ గెలిచి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపడితే అది నిరుపేదల గెలుపు అవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కుండా వారి వీధిలో శనివారం ప్రచారం నిర్వహించారు. 17వ వార్డులో కుండా రాజు, దాసు వారితోపాటు మరో 30 కుటుంబాల వారంతా వైఎస్సార్‌సీపీలో చేరగా, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో షామీర్, ఫయాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.